క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఓటర్లు నమోదుకు 6వ తేదీ వరకు అవకాశం



పొన్నూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 6 వరకు అర్హత కలిగిన వారు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నిడుబ్రోలు జెడ్పీ పాఠశాలలోని 4 పోలింగ్ కేంద్రాలలో ఓటు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో నూతన ఓటరు ప్రక్రియ వేగవంతంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల విడుదల చేసిన ఓటరు ముసాయిదా జాబితాపై డిసెంబరు 15 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండే యువకులంతా ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని కోరారు. జనవరి 6న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అందరి సమన్వయంతో అభివృద్ధి కృషి

ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు



పెదకాకాని: అందరి సమన్వయంతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మండలంలోని అన్ని పార్టీల నాయకులతో కలసి మండలంలో గ్రామాల వారీగా సమస్యలు గుర్తించడం, వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పలువురు మండల స్థాయి అధికారులు విద్య, వైద్య, పారిశుద్ధ్యం, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, డ్వాక్రా ఏపీఎం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ శాఖల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణకాంత్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. పలు శాఖల మండల అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు.

రోడ్ల మరమ్మతులకు రూ.6 కోట్లు

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వంలో రోడ్లకు పూర్వ వైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. పెదనందిపాడు, కాకుమాను మండలం రేటూరు గ్రామాల్లో శనివారం రోడ్లకు మరమ్మతులు చేసే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం పద్దెనిమిది ప్రదేశాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకు గాను నియోజకవర్గానికి రూ.6 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. సంక్రాంతి నాటికి ఆర్ అండ్ బీ రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి తీరుతామని చెప్పారు. అయితే ఇది కేవలం తాత్కాలికమేనని, గోతులమయమైన రోడ్లపై ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉపశమనం కలిగించేందుకు అత్యవసరంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. రానున్న రోజుల్లో మరింత చిత్తశుద్ధితో రోడ్లను అభివృద్ధి చేస్తామని వివరించారు.

ఏఈలకు షోకాజ్ నోటీసులు జారీ

నెహ్రూనగర్: ప్రజలకు ప్రభుత్వ సేవలను నిర్దేశిత గడువులోగా అందించడంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. తాగునీటి ట్యాప్ కనెక్షన్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై ముగ్గురు ఏఈలు, నలుగురు వార్డ్ అడ్మిన్ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అందించే అర్జీలను అధికారులు తప్పనిసరిగా సర్వీస్ లెవల్ అగ్రిమెంట్(ఎస్ఎల్ఏ) మేరకు నిర్దేశిత గడువు 15 రోజులు లోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను ఎస్ఎల్ఏ లోపు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఏఈలు పి.వెంకటేశ్వరరావు, కె.సాంబశివరావు, బి.చైతన్యలకు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులు వి.రాంబాబు నాయక్, ఎస్.నాగరాజు, ఎ.వెంకటేశ్వర్లు, ఎస్.వేణుగోపాల్ రావులకు క్రమశిక్షణ చర్యలు, పెనాల్టీ విధింపు ఎందుకు చేపట్టకూడదో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు చెప్పారు.

ప్చ్..అన్నీ నిషేధిత క్యారీ బ్యాగులే

- అమలుకు నోచుకోని ప్రభుత్వ జీఓలు
- ప్లాస్టిక్ వస్తు వినియోగంతో కాలుష్యం



ఇటీవల జరిగిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నడింపాలెంలో దుకాణదారులకు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, గ్లాసులు వాడవద్దంటూ నోటీసులిస్తున్న పంచాయతీ అధికారులు



నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు ఇవే

ప్రత్తిపాడు: ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధం అమలుకు నోచుకోవడం లేదు. పర్యావరణ కాలుష్యం తగ్గాలంటే ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా నిషేధించాల్సిన పరిస్థితి ఉంది. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛభారత్, స్వచ్ఛతా హీ సేవ అంటూ హడావిడి చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధం అమలుపై దృష్టి సారించడం లేదు.

నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్, కాకుమాను మండలాల్లో మొత్తం 79 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రత్తిపాడు పెదనందిపాడు మండలాల్లోని కొన్ని గ్రామ పంచాయతీలు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధిస్తూ నిషేధాజ్ఞలు జారీ చేశాయి. కానీ ఆదేశాలు అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. సంవత్సరాల క్రితమే ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ తీర్మానాలు చేసినప్పటికీ అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడంతో ఉన్నత ఆశయం అభాసుపాలవుతోంది.

ప్లాస్టిక్ క్యారీబ్యాగుల వలన ఇవీ అనర్థాలు..

- భూమి, నీరు, వాయువులు కలుషితం అవుతాయి
- భూగర్భ జలాలు దెబ్బతిని, సారవంతమైన పంటభూములు నిస్సారమవుతాయి
- ప్లాస్టిక్ వాడకం వలన ప్రమాదకర క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంది
- నాడీ వ్యవస్థతో పాటు ఎర్ర రక్తకణాలు, కాలేయం, మూత్రపిండాలపై ప్రభావం చూపుతుంది
- ప్లాస్టిక్‌ను కాల్చితే వచ్చే లిక్విడ్ హైడ్రో కార్బన్ వాయువు వలన గాలి కలుషితమవుతుంది
- పిల్లలు పలు రకాల లోపాలతో జన్మిస్తారు.
- క్యారీబ్యాగుల్లో పిగ్‌మెంట్లు, ప్లాస్టిసైజర్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వలన వ్యాధులబారిన పడుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలే మేలు..

- జూట్, పేపరు, కాటన్ బ్యాగులను మాత్రమే ఉపయోగించాలి.
- ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలి.
- పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ విక్రయదారులపై అపరాధ రుసుములు విధించాలి.
- దుకాణదారుల్లో ప్లాస్టిక్ క్యారీబ్యాగుల వాడకం వలన అనర్థాలపై అవగాహన కల్పించాలి.
- ముఖ్యంగా నిషేధంలో ప్రజలను భాగస్వాములను చేయాలి.

ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తాం

ప్లాస్టిక్ క్యారీబ్యాగులను వాడరాదంటూ ఇప్పటికే గ్రామంలో అవగాహన కల్పిస్తున్నాం. మండలంలో నడింపాలెంపై ఫోకస్ చేసి దుకాణదారులకు నోటీసులిచ్చాం. అపరాధ రుసుములు విధించేందుకు ప్రత్యేకంగా మహిళా పోలీసుల సహకారం తీసుకుంటున్నాం. ప్రత్తిపాడుతో పాటు మరికొన్ని పంచాయతీల్లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను నిషేధాన్ని అమలు చేసేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలి.

–షేక్ ఖాజా, ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రత్తిపాడు

6న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్



లక్ష్మీపురం: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నవంబర్ 6 తేదీన కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ధర్నా పోస్టర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థి దీవెన వసతి దీవెనలు వెంటనే విడుదల చేయాలని, జీఓ నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని, డిగ్రీ విద్యార్థులకు మేజర్, మైనర్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను రూ.3,000లకు పెంచాలని, మెడికల్ సీట్ల అమ్మకాలను వెంటనే నిలిపివేయాలని, 107,108, జీఓలను వెంటనే రద్దు చేయాలని కోరారు.గుంటూరు నగరంలోని కోడిగుడ్డు సత్రం హాస్టల్ వెంటనే ప్రారంభించాలని, కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు ఆదివారం, ఇతర ప్రభుత్వ సెలవు దినాల్లో కళాశాలలు నిర్వహించకుండా చూడాలని డిమాండ్లతో కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్కే సమీర్, జిల్లా సహాయ కార్యదర్శి యశ్వంత్, ఉదయరాజు, గోపి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వేజండ్ల విద్యార్థినుల ఎంపిక



క్రీడాకారులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి జుహితతో హెచ్‌ఎం, పీఈటీలు

చేబ్రోలు: మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు బాలికలు వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ టి.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూతక్కి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి జట్టుకు ఎంపికయ్యారు. అండర్ –14 బాలికల వాలీబాల్ జట్టుకు కె.నాగమల్లేశ్వరి, జె.నాగూర్‌బీ, వై.నందిని, వై.భవానీ ఎంపికయ్యారు. నవంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలను హెచ్‌ఎం టి.విజయశ్రీ, ఎస్ఎంసీ చైర్మన్ పఠాన్ రబియా నష్రా, పీఈటీ టి.వెంకటేశ్వరరావు అభినందించారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు. .

శేకూరు(చేబ్రోలు): రాష్ట్ర స్థాయి అండర్– 14 బాలబాలికల హ్యాండ్ బాల్ పోటీలలో చేబ్రోలు మండలం శేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జుహిత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ వీవీడీ కిషోర్ శనివారం తెలిపారు. తెనాలిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జుహితను హెచ్‌ఎం కేఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు మేకల సుబ్బారావు, విద్యా కమిటీ చైర్మన్ గోపి అభినందించారు.

హాస్టల్ వాచ్‌మెన్‌ను విధుల నుంచి తొలగించాలి

లక్ష్మీపురం: పెదనందిపాడు మండలంలోని ఎస్సీ బాలుర హాస్టల్లో ఉంటూ జెడ్పీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులపై వాచ్‌మెన్ దాడి చేయడాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ ఖండించారు. స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారుల వైఫల్యం వలనే ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు.

విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి అమర్నాథ్, నగర అధ్యక్షులు సాయి పాల్గొన్నారు

అభిషేక ప్రియునికి కార్తిక దీపారాధన పూజలు

- పెదకాకాని శివాలయంలో ప్రారంభమైన కార్తికమాస పూజలు
- నిత్య హోమాలు, ఏకాదశ రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు
- భక్తులకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు: డీసీ లీలా కుమార్



కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని శివాలయంలో కార్తిక మాస పూజలు భక్తిశ్రద్ధలతో శనివారం ప్రారంభమయ్యాయి. పెదకాకాని శివయ్య సన్నిధిలో కార్తిక మాసం భక్తుల సందడి ప్రారంభమైంది. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణంలోని యజ్ఞాల బావి నీటితో స్నానాలు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వెంట తెచ్చుకున్న పూజా సామగ్రితో దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్తికమాసం పురస్కరించుకుని ఆది, సోమవారాల్లో ఆలయానికి అధికసంఖ్యలో విచ్చేయు భక్తులకు దాతల సహకారంతో ఉదయం పాలు, మజ్జిగ, తాగు నీరు, స్వామి వారి ఉచిత అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తులందరూ స్వామి దర్శించుకోవాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ కోరారు.

జస్టిస్ అంబటి లక్ష్మణరావుకు ఘన నివాళి





నివాళులర్పిస్తున్న అంబటి రాంబాబు, మురళీకృష్ణ తదితరులు

పొన్నూరు: మండలంలోని వెల్లలూరులో అలహాబాద్ హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అంబటి లక్ష్మణరావు సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ రూత్ రాణి, గ్రామ సర్పంచి ఇక్కుర్తి మల్లికార్జునరావు పాల్గొని జస్టిస్ లక్ష్మణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆంధ్ర రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడారు.

ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ సీపీ అండ

ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



వేణును పరామర్శిస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి

పెదకాకాని: ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తాడిబోయిన వేణుగోపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురిఅయ్యారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన తాడిబోయిన వేణును శస్త్ర చికిత్స అనంతరం నివాసానికి తీసుకొచ్చారు. ఎంపీ శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను, కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ వెంట స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు వుయ్యూరి సతీష్‌రెడ్డి, ఆలపాటి రాఘవ, సుంకర కృష్ణారెడ్డి, నర్సిరెడ్డి, ముడియాల మల్లికార్జునరెడ్డి, అర్థల గడ్డేశ్వరరావు, షేక్ నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

పొన్నూరు: దీపం– 2 పథకంలో భాగంగా పట్టణంలోని ఇటికంపాడు రోడ్‌లో శనివారం లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, తహసీల్దార్ జియావుల్ హక్ పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఇన్నోవేషన్ వర్క్ షాప్



క్విజ్ పోటీలలో విజేతలతో కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: విద్యార్థులు ఆవిష్కర్తలుగా రూపొందేందుకు, పాఠశాల స్థాయి నుంచి వినూత్న ఆలోచనలతో కూడిన ప్రయోగాత్మక పరిశోధనలు చేయాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. శనివారం చౌడవరంలోని కళాశాలలో కళాశాల, స్టెప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రాస్ నెక్స్ట్‌జెన్ ఎంటర్ ప్రెన్యూర్ బూట్ క్యాంప్ ఫర్ స్కూల్ స్టూడెంట్స్ పేరుతో ఇన్నోవేషన్ వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో నగరానికి చెందిన కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ పాఠశాల విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని, కళాశాలలోని ఐటీబీఐ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టార్ట్‌అప్‌ల ఏర్పాటుకు, నూతన ఆవిష్కరణలకు స్మార్ట్ ఐడియా, ప్రొటోటైప్, ఇన్నోవేషన్ల లోని వివిధ దశల ప్రక్రియలను గురించి అధ్యాపకులు, విద్యార్థులకు వివరించారు. అనేక పరిశోధనలకు ఐటీబీఐ సెంటర్లో అందుబాటులో ఉన్న వివిధ యంత్రాలను, వాటి పనితీరు, వాటి ద్వారా ఉత్పత్తి అయ్యే పరికరాలను నిపుణులు, విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసి, వారిని ప్రోత్సహించేందుకు, టెక్నికల్ క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఐటీబీఐ సెంటర్ ప్రిన్సిపాల్ ఆఫ్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎంపీపీ చంద్రశేఖర్, సీఈఓ డాక్టర్ మహేంద్రవర్మ, కో ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎస్.రాధికా, ఇంక్యూబేషన్ మేనేజర్ డాక్టర్ కె.శోభా, కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ క్షమిత పాల్గొన్నారు.

పన్నులు పెంచండి.. ఆదాయం వృద్ధి చేయండి

పంచాయతీ కార్యదర్శిని ఆదేశించిన డీఎల్‌పీఓ కె. శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: 'సెక్రటరీ సహా సిబ్బంది అంతా ఊరు మొత్తం తిరగండి. ఇల్లు.. ఇల్లు.. పరిశీలించండి. పన్నులు పెంచండి. ఆదాయం వృద్ధి చేయండి' అంటూ డీఎల్‌పీఓ కె. శ్రీనివాసరావు పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్మికులు, పన్నుల వసూలు, ఆదాయ, వ్యయాలు.. వంటి పూర్తి వివరాలను ఇన్‌చార్జి కార్యదర్శి షేక్ ఖాజాను అడిగి తెలుసుకున్నారు. ప్రత్తిపాడు పంచాయతీలో పాత బకాయిలు సుమారు రూ.65 లక్షల మేర వసూలు చేయాల్సి ఉండటంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. మండలంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులందరినీ ప్రత్యేక బృందాలుగా చేసి పన్నులు వసూలు చేయాలన్నారు. దీర్ఘకాలికంగా బకాయిలు ఉన్న వారి కుళాయిలు డమ్మీలు చేయాలని ఆదేశించారు. అదే విధంగా గతంలో పన్నులు వేసిన బిల్డింగులను కూడా మరో సారి పరిశీలించి, పన్ను పెంచే అవకాశం ఉంటే తమ అనుమతి తీసుకుని పెంచాలని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని మైకులు, ప్రత్యేక ప్రచారం ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. అదేవిధంగా పంచాయతీ నుంచి కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని చెప్పారు. రోజుమార్చి రోజు గ్రామంలోనికి తాగు నీరు సరఫరా చేసే విధంగా అదనంగా ఒక్కరు లేదా ఇద్దరు ఆపరేటర్లను నియమించుకోవాలని, ఇంటింటికీ చెత్త సేకరించేందుకు వీలుగా మానివేసిన ఆరుగురు పారిశుద్ధ్య కార్మికులను తిరిగి విధుల్లోనికి తీసుకోవాలని చెప్పారు. వెంట ఈఓపీఆర్డీ జి.రవికుమార్ పాల్గొన్నారు.

ఇంటికి పంపించివేస్తా...

ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్న కోటేశ్వరరావుపై డీఎల్‌పీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన స్థానంలో మరొకరు జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరి దాదాపుగా నెల రోజులు అవుతున్నా, ఆమెకు రికార్డులు అప్పగించకుండా తాళాలు జేబులో వేసుకుని కాలక్షేపం చేస్తుండటంపై మండిపడ్డారు. ఇప్పటి వరకు ఎందుకు చార్జి హ్యాండ్ ఓవర్ చేయలేదని ప్రశ్నించారు. మంగళవారం లోపల నూతన జేఏకు రికార్డులు అప్పగించకపోతే ఇక ఇంటికి పంపించి వేస్తానని కోటేశ్వరరావును హెచ్చరించారు.

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో వైఫల్యం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగాలకు సకాలంలో నోటిఫికేషన్లు విడుదల చేసి, ఉద్యోగ నియామక పరీక్షలను నిర్వహించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కృష్ణా– గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుమ్మా శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. పొన్నూరురోడ్డులోని టార్గెట్ ఐఏఎస్ అకాడమీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న శాసనమండలి గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

వేల ఎకరాలు అవసరం లేదు..

లక్ష్మీపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రుషికొండ ప్యాలెస్ పేరుతో వ్యాఖ్యానిస్తూ దాని ఖర్చు గురించి ఆశ్చర్యపోతున్నారని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగమ్) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంత ఖర్చు అవసరమా అని ప్రశ్నించిన చంద్రబాబు నాయుడు చిన్న రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు 33 వేల ఎకరాల కోర్ రాజధాని ఎందుకు అవసరమో చెప్పాలని డిమాండ్ చేశారు.

సిలంబం పోటీల్లో బంగారు పతకాలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఇండియన్ సిలంబం ఫెడరేషన్ నిర్వహించిన జాతీయస్థాయి సిలంబం చాంపియన్‌షిప్–2024లో మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలను కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ సెబాస్టియన్ తెలిపారు. శనివారం లక్ష్మీపురంలోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సెబాస్టియన్ మాట్లాడుతూ గత నెల 27న శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో నిర్వహించిన జాతీయస్థాయి కర్ర సాము పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని వి.హన్సివి మీనాక్షి, 8వ తరగతి విద్యార్థి వి.వైదిక్ సత్తా చాటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.